క్లుప్తంగా

ఘనంగా సీతారామచంద్ర స్వామి సప్తాహాలు



పుట్టకొండ సప్తాహాల్లో స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి బృందం

పెదపూడి: సీతారామచంద్రస్వామి సప్తాహాలు ఘనంగా జరుగుతున్నాయని పుట్టకొండ గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ అన్నారు. పుట్టకొండలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో సీతారామచంద్రస్వామి ప్రథమ సప్తాహాలు ఏడో రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. ప్రముఖ పండితులు పి.కమలాకర్, చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఆరు రోజులుగా సప్తాహాలు కనులపండువగా జరుగుతున్నాయన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, భజన మండలి బృందం నిర్వాహకుడు కాశీ భజనమండలి ఆలపించిన సంకీర్తనలు అందరినీ అలరించాయి. అనంతరం ఆ భజన బృందాలను సప్తాహ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. శనివారంతో కార్యక్రమాలు పూర్తవుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

రాజానగరం: పల్లకడియంలో చెరువులో మట్టిని తవ్వే విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చెరువులో మట్టిని తవ్వడంతోపాటు గట్టుపై ఉన్న ఏళ్ల తరబడి ఉన్న చెట్లను అమ్మేశారని ఒకవర్గం ఆరోపణ. దీనిపై వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సంబంధిత వ్యక్తులపై అవతలి వర్గం దాడికి దిగింది. దీంతో రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు.

ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని, స్పెషల్ ఆఫీసర్లు తమ వార్డు పరిధిలో విస్తృతంగా పర్యటించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి మున్సిపల్, పోలీసు అధికారులతో కూడిన 5 శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ బృందాలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో కలిసి పలు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నాయని అన్నారు. పిడింగొయ్యి ప్రాంతంలో వేంకటేశ్వర హోల్‌సేల్ మార్కెట్‌లో దాడులు నిర్వహించగా, సుమారు 2 టన్నుల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రూ.12 లక్షల జరిమానా విధించామన్నారు.

విస్తృతంగా అవగాహన

మానవాళికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను వినియోగించడం ద్వారా జరిగే అనర్థాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వారి నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వ్యాపార వర్గాలు, వినియోగదారులు తమకు సహకరించి నగర పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంహెచ్ఓ ఎ.వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు దూరంగా సహకారం

- నామినేటెడ్ పదవులతోనే సరి
- ఏడాదిగా అదీ లేని వైనం



శ్రీరంగపట్నంలో సహకారం సంఘ భవనం

రాజానగరం: వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు సహకార వ్యవస్థను తీసుకువచ్చారు. సహకార పరపతి సంఘాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతి సంఘానికి పాలకవర్గాలను ప్రతి ఐదేళ్లకు ఒకసారి సభ్యులు ఎన్నుకోవడం జరుగుతుంది. అయితే 2013 ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్నికల తరువాత ఇంతవరకూ తిరిగి ఎన్నికలు జరగలేదు. పన్నెండేళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో సహకార వ్యవస్థ లక్ష్యానికి దూరంగా వెళ్తుందనే విమర్శలు వస్తున్నాయి.

ఈ క్రమంలో నేడు సహకార వ్యవస్థ వ్యవసాయ రంగం అభివృద్ధి కంటే రాజకీయంగా పదవులు పందేరానికి దోహదపడుతుందనే ఆరోపణలు కూడా లేకపోలేదు. త్రీమెన్, ఫైవ్‌మెన్ కమిటీలను వేస్తూ, రైతులకు తూతూ మంత్రంగా సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో అడిగేవారు (పాలకవర్గాలు) లేకపోవడంతో కొన్నిచోట్ల సిబ్బంది ఇష్టారాజ్యంగా, అవినీతికి ఆనవాళ్లుగా సహకారం సంఘాలు నడుస్తున్నాయి. అయినా పట్టించుకునేవారు లేకపోయారు.

డివిజన్‌లో 49 సహకార సంఘాలు

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 49 సహకార సంఘాలు ఉన్నాయి. వీటికి మొన్నటివరకు త్రిసభ్య కమిటీలు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంగా కమిటీలు కూడా వేయలేదు. ఐదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతూంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రత్యేక నిధులు వచ్చేవి. పాలకవర్గాలు లేకపోవడంతో ఈ నిధులు మంజూరు కావడం లేదు. నిధులు రాకపోవడంతో రైతులకు అందజేసే రుణాలలో రాయితీలు దక్కని పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాదు వ్యవసాయ రంగానికి తోడ్పాటునందించేలా పంపిణీ చేసే ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, వ్యవసాయ పనిముట్లు రైతులు పొందలేకపోతున్నారు.

పాలకుల సిఫారసు తోనే..

సహకార సంఘాలకు ఏ కారణాలతో ఎన్నికలు నిర్వహించడం లేదనేది చెప్పేవారు లేరు. సంబంధిత అధికారులు మాత్రం పాలకుల నిర్ణయం మేరకు తాము పనిచేయాల్సి ఉంటుందని, ఇంతకు మించి వివరణ ఇవ్వలేమంటూ సమాధానమిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాల స్థానే నియమించే కమిటీలు ఆయా ప్రాంతంలోని ఎమ్మెల్యేల సిఫార్సులతోనే ఏర్పడుతున్నాయి. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇంతవరకు కమిటీలను ఎందుకు వేయలేదో అర్థం కావడం లేదు. రేపు, మాపు అంటూ ఏడాది గడిపేశారు. ఈ పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆశావహులు జేబులు ఖాళీ అయిపోతున్నా, వారి ఆశలు నెరవేరడం లేదని వాపోతున్నారు. కాగా డివిజన్ పరిధిలో ఉన్న 49 సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో కమిటీలను వేసేందుకు సంబంధిత ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేల సిఫార్సులతో ప్రక్రియ జరుగుతుందనే ప్రచారం ఉంది.

వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా సహకారం సంఘాలకు నామినేటెట్ పద్ధతిలో కమిటీలను కూడా వేయకపోవడం విడ్డూరంగా ఉంది. కమిటీలలో ప్రాధాన్యతను పొందేవారి నుంచి పెద్దలు ఏదో ఆశిస్తున్నట్టుగా ఉన్నారు. వాటి కోసమే ఆలస్యమవుతున్నట్టు ఉంది. వ్యవస్థను నిర్వీర్యం చేయవద్దు.

–గంగిశెట్టి సోమేశ్వర్రావు, పాలచర్ల

జక్కంపూడిని విమర్శిస్తే ఊరుకోం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- అక్రమాలకు పాల్పడేది బత్తులే
- రాజానగరం వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం

రాజానగరం: నియోజకవర్గంలో దోపిడీయే అజెండాగా పని చేస్తున్న వ్యక్తి దోపిడీ గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని వైఎస్సార్ సీపీ మండల నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇకపై ఇలాంటి చర్యలను ఊరుకునేది లేదన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, సీనియర్ నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వేమగిరి కృష్ణ, మార్గాని శ్రీను తదితరులు మాట్లాడారు. ప్రజాసేవే పరమావధిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే జక్కంపూడి కుటుంబం గురించి విమర్శించే అర్హత బత్తులకు లేదన్నారు. ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని అన్నారు. బినామీ పేర్లతో అక్రమాలకు పాల్పడేది ఎవరో జనాలకు తెలుసని అన్నారు. ఎదుటి వారిపై బురద జల్లడం బత్తుల నైజమైతే, జనం కోసం నిరంతరం పాటుపడే స్వభావం జక్కంపూడిదని తెలిపారు.

ప్రకృతి వనరులను దోచేస్తూ..

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరగకపోవడంతో వైఎస్సార్ సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినానికి జనం నుంచి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. వరాలు కురిపించిన దేవుడిని కాదనుకుని, రాక్షసులకు అధికారం ఇచ్చామని జనమంతా ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఇసుక, మట్టి, కొండలు, చెరువులు ఇలా.. ప్రకృతి వనరులను ఎమ్మెల్యే దోచేస్తున్నారని విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే గోదావరి ర్యాంప్‌ల వద్ద ఉన్న ఇసుక నిల్వలను తరలించుకుపోయిన మీరు దోపిడీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అంతటితో ఆగకుండా నియోజకవర్గంలో కొండలపై పడ్డారని అన్నారు. ఇప్పుడు రైతుల పేరుతో చెరువులను తవ్వేస్తున్నారన్నారు.

ఐక్యంగా ముందుకు సాగుదాం..



ఇల్లపల్లిలో పుట్టా సోమన్నను సత్కరిస్తున్న రైతులు

బిక్కవోలు: ఐదు గ్రామాల రైతులు ఐక్యంగా ముందుకు సాగి, ఇల్లపల్లి శ్రీవిగ్నేశ్వర ఎత్తిపోతల పథకాన్ని సంరక్షించుకుందామని జిల్లా ఎత్తిపోతల సంఘ అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలపల్లి, ఇల్లపల్లి, రంగాపురం, రంగాపురం పాకల, రంగంపేట మండలం మర్రిపూడి గ్రామాలల్లో చెందని ఇల్లపల్లి శ్రీవిగ్నేశ్వర ఎత్తిపోతల పథకం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట ఈ పథకం ఏర్పాటు చేశారన్నారు. సుమారు 750 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. జిల్లాలోనే ఆదర్శవంతమైన ఎత్తిపోతల పథకంగా పేరొందిందన్నారు. పది చెరువుల్లో పూడిక తీస్తే రైతులకు మరింత సమృద్ధిగా నీరు అందుతుందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతు సోమన్నను ఘనంగా సత్కరించారు. ఎత్తిపోతల డైరెక్టర్ చీకట్ల భీమరాజు, రైతులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం

విజయవంతంతో మతిభ్రమించిందా!

- ఎమ్మెల్యే నల్లమిల్లి వ్యాఖ్యలు సరికావు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వైఎస్సార్ సీపీ బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతమైందని, దీనిని చూసి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మతిభ్రమించిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అంటూ రామకృష్ణారెడ్డి సంబోధిస్తున్నారని, నీవే పెద్ద సైకోవని నియోజకవర్గ ప్రజలంతా గుర్తించారని అన్నారు. అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచి ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపులు చేస్తుండటాన్ని ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టి పేదలకు అండగా ఉంటుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఇప్పటికే విసుగు చెంది ఉన్నారని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను అంతా తలుచుకుంటున్నారని తెలిపారు. తాను పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ ముందుకు సాగుతానన్నారు.

అధ్యాపకుల యోగాసనాలు



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



పెదపూడిలో యోగాసనాలు వేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి తదితరులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు శుక్రవారం యోగసనాలు వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 21 వరకు యోగాంధ్రలో భాగంగా రోజూ యోగాసనాలు వేస్తారన్నారు. దీనిలో విద్యార్థుల భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధామయి, మీనాక్షి, వాణి, ఫణీంద్ర, వెంకటేష్, శివ, దుర్గా ప్రసాద్, సురేష్ చంద్ర, జానీ, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

21న యోగా దినోత్సవం

రాజానగరం: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రాంగణంలో సుమారు 10 వేల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా యోగాపై అవగాహన కలిగిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రాంగణంలో జీజీయూ ఉద్యోగులతో కలసి చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) పర్యవేక్షణలో యోగా సాధన చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెదపూడి: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగా పోటీల్లో ఆయన పాల్గొని, యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న యోగా దినోత్సవం సందర్భంగా కరకుదురు, జి.మామిడాడ, కాండ్రేగుల, పెదపూడి గ్రామాల్లో అధికారులు, ప్రజలు, విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారన్నారు. యోగా మాస్టార్లు సాయి, గిరి, కౌర్ తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞంలా మొక్కలు నాటుదాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓ యజ్ఞంలా మొక్కలు నాటాలని ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం నుంచి ఈ నెల మూడో శనివారం నీరు– మీరు కార్యక్రమం వరకూ ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటడానికి స్థలాలను సర్వే చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలు, గ్రామ పంచాయతీ కామన్ స్థలాలు చుట్టూ మొక్కలు నాటాలన్నారు. ప్రతి పంచాయతీ, ప్రభుత్వ స్థలాల్లో అవసరమైన మొక్కలు నాటడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మూడో శనివారం క్లీన్ గ్రీన్, నీరు– మీరులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రపరచడం, నీటి వృథా అరికట్టడం తదితర అంశాలతో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మొక్కలు నాటడంతో పాటు పెంచేందుకు ఒక్కో ఉద్యోగస్తుడు ఒక్కో మొక్కను దత్తత తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కొత్తగా విధుల్లోకి చేరిన సచివాలయ కార్యదర్శులకు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారన్నారు. ఎండలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, సుంకర వీరస్వామి నాయుడు, లక్ష్మీనారాయణ, స్వరూప్‌రెడ్డి, శ్రీనువాస్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం



కొంకుదురు సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శిరీషా

బిక్కవోలు: రైతులు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వేమగిరి ఐసీఏఆర్ డీఎఫ్ఆర్ టి.శిరీషా అన్నారు. శుక్రవారం కొంకుదురులోని ఐసీఆర్, వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వరంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం, నవ ధాన్యాలతో సాగు, మట్టిలో పోషక విలువలను గుర్తించి తద్వారా ఎరువుల వినియోగం, పంట ఎంపిక తదితర విషయాలపై వివరించారు. పీఎం కిసాన్, ఫసల్ బీమా, ఆర్కేవీవై, ఉద్యాన పంటల సాగు గురించి తెలిపారు. శాస్త్రవేత్తలు శోభారావు, అర్జుమన, రఘునందన, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శామ్యూల్ జాన్, మండల పశువర్ధక శాఖ అధికారి వీర్రాజు, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ, సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, తొస్సిపూడి నీటి సంఘ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటకు చెందిన గుడిసె రాజు (36) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం... రాజు భార్య గుడిసె దుర్గ వేరే ఊరు వెళ్లింది. కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 29న రాత్రి దుర్గకు ఫోన్ చేసి, తాను చనిపోతానని హెచ్చరించి, రాజు గడ్డి మందు తాగాడు. గమనించిన రాజు అన్నయ్య వనరాజు రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు, దుర్గ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు

శ్రీరామకోటి స్థూపంలో విగ్రహ ప్రతిష్ఠ



పురుషోత్తపట్నం దగ్గరలో ఉన్న శ్రీరామదుర్గం కొండపై శ్రీరామకోటి స్థూపం

సీతానగరం: పురుషోత్తపట్నం వద్ద ఉన్న శ్రీరామదుర్గం కొండపై రామాలయంలో శ్రీరామకోటి స్థూపంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. పురుషోత్తపట్నానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరామదుర్గం కొండపై కొలువైన శ్రీసీతారాముల ఆలయం వద్ద శ్రీరామకోటి స్థూపాన్ని భక్తులు, ప్రజల సహాయ, సహకారాలతో నెలకొల్పారు. అర్చకుడు మద్దూరి నాగార్జున శర్మ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి.

దేవస్థానం భూములకు బహిరంగ వేలం

కోరుకొండ: మునగాల గ్రామానికి చెందిన శ్రీసీతారామస్వామి దేవస్థానం భూముల కౌలుహక్కు టెండర్ కం బహిరంగ వేలం పాట ఈ నెల 9న నిర్వహించనున్నట్టు ఆలయ సింగిల్ ట్రస్టీ, (అర్చకుడు) కె.కృష్ణ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు పాట నిర్వహించనున్నారు. స్వామివారికి 6–11 ఎకరాలు పంట పొలం ఉంది. దీనిని 3 బిట్‌లుగా విభజించి పాటనిర్వహిస్తారు.

పూర్తయిన సర్వే

సీతానగరం: మండలంలో అత్యంత నిరు పేదలను గుర్తించడానికి సర్వే చేసినట్లు డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో పీ– 4 సర్వే పూర్తయ్యిందని, గ్రామాల్లో నిరుపేదలను గుర్తించామన్నారు. ఉద్యోగులు, ధనవంతులు, భూస్వాములు, స్వచ్ఛంద సంస్థలు దత్తత తీసుకుని, వారి కుటుంబంలోని పిల్లలకు విద్య, అలాగే కుటుంబ పోషణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



శ్రీహర్షితరెడ్డిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

అనపర్తి: గ్రామానికి చెందిన శ్రీహర్షితరెడ్డికి జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 246 ర్యాంకు సాధించాడని అతని తల్లిదండ్రులు జయగంగాధర్‌రెడ్డి, హేమమాలిని శుక్రవారం తెలిపారు. సాక్షి స్పెల్‌బీ, సాక్షి మ్యాథ్స్ బీలో మూడు సార్లు విజేతగా నిలిచాడన్నారు. అనపర్తి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేసిన దివంగత కర్రి సత్యనారాయణరెడ్డికి, అలాగే అనపర్తి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ అధినేత కర్రి సాంబశివారెడ్డికి శ్రీహర్షితరెడ్డి మనవడు. అతన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు.

మసీదుల వద్ద నేడు ప్రత్యేక నిఘా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ డి.నరసింహకిశోర్ బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు, సోలార్ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ముస్లిం సోదర సోదరీమణులు పండగ జరుపుకోవాలన్నారు. మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



సీతానగరంలో విద్యార్థికి ప్రశంసా పత్రం, బహుమతి అందిస్తున్న ముఖ్య అతిథులు



రాజానగరంలో విజేతకు బహుమతి అందజేత



ధ్రువపత్రాలు అందుకున్న రంగంపేట విద్యార్థులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిశాయని లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విశ్రాంత సహాయ సంక్షేమ అధికారి ఓఎస్ సురేష్‌బాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.భాస్కరరావు, ఉపాధ్యాయులు జి.శేఖర్, ఎస్.రామకృష్ణ, జి.అశోక్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్‌బాబులు మాట్లాడారు. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, చదవడం మాకిష్టంలో భాగంగా ×కొంగ నక్క× అనే బాలల కథను చదివించారు. 34 రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యానే కథలకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ, క్విజ్, చదరంగం, తెలుగు పద్యాలు తదతర పోటీలలో విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, మోరల్ బుక్స్, పరీక్ష అట్టలు, పౌచెస్, ప్లాస్టిక్ స్కేల్స్‌లను బహుమతులుగా అందించారు.

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద 35 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ అధికారి నల్లమిల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు గ్రంథాలయం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. అలాగే ముఖ్య అతిథులు వుండవిల్లి మాణిక్యం, పీవీ సాయి వరప్రసాద్, కంటిపూడి దేవి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి మహనీయులు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను చదువుకుని ఆదర్శంగా తీసుకోవాలలన్నారు. సెల్‌ఫోన్ దూరంగా ఉంటే ఎంతో మంచిదన్నారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు.

రాజానగరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఏప్రిల్ 27న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో స్థానిక విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, పాటలు, దేశభక్తి గీతాలు, క్రాఫ్ట్ వర్క్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశామని లైబ్రేరియన్ కలగర సత్యనారాయణ తెలిపారు.